క్లుప్తంగా

నేడు ఐడీపీఎస్‌లో చిత్ర లేఖన పోటీలు

చాపాడు: ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం చిత్ర లేఖన పోటీలు నిర్వహించనున్నట్లు చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. పాఠశాలలో జరిగే ఈ పోటీల్లో నగదుతో పాటు బహుమతులు కూడా అందజేస్తామని తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో 1, 2, 3 తరగతులు విద్యార్థులకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1500, జూనియర్స్ విభాగంలో 4, 5, 6 తరగతుల విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.1500, సీనియర్స్ విభాగంలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 8500857111, 8500856111 నంబర్లలో సంప్రదించాలని చైర్మన్ కోరారు.

బీరుబాటిళ్ల పట్టివేత

కలసపాడు: కాశినాయన మండలం వరికుంట్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి శనివారం 15 బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పోరుమామిళ్ల సీఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ నాగార్జున, కానిస్టేబుళ్లు రవితేజ, సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ, అంకాళమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, అంకాళమ్మ

పోరుమామిళ్ల: రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో వెలసిన పోలేరమ్మ, అంకాలమ్మ తిరునాలను వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి గ్రామదేవతలను దర్శించుకొని, కాయకర్పూరం సమర్పించుకున్నారు. రాఘవేంద్రనగర్ భక్తులు మధ్యాహ్నం అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత అధికారి మూర్తయ్య, ఉపసర్పంచ్ రుద్రవరం నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీఎస్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు ఉచిత కోచింగ్‌తో పాటు మెటీరియల్ అందిస్తామని, అర్హులైన పేద విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కలిస్తామని పేర్కొన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామని తెలిపారు. పాలిసెట్‌కు విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతి హాల్ టికెట్, ఆధార్‌కార్డుతో పాటు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 అప్లికేషన్ రూసుంతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.


వలంటీర్ల రాజీనామాలు



రాజీనామా పత్రాలతో వలంటీర్లు

కాశినాయన: మండల కేంద్రమైన నరసాపురం గ్రామ సచివాలయం పరిధిలోని నరసాపురం, మిద్దెల, మూలపల్లె, నరసన్నపల్లె గ్రామాల్లో పనిచేస్తున్న 23 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ రామకృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాము వలంటీర్లుగా పనిచేసి పార్టీలు, కులాలకు అతీతంగా ప్రజలకు సేవ చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు వలంటీర్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్: మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని శనివారం ఆలయ ఆవరణలో రాజంపేట దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. గతేడాది జూన్ 14 నుంచి ఇటీవల ముగిసిన బ్రహ్మోత్సవాల వరకు హుండీలో భక్తులు సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ.2,15,616 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు చిన్నమ్మ, పెద్దమ్మ దేవర

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కోటవీధిలో చిన్నమ్మ, పెద్దమ్మ దేవర మహోత్సవం (ముద్ద) నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఉగాది పండుగకు ముందు వచ్చే ఆదివారం రోజున దేవరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

ప్రతి హామీని అమలు చేశాం

- సీఎం వైఎస్ జగన్ పాలనలో అందరికీ న్యాయం
- చంద్రబాబును నమ్మవద్దు
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం దువ్వూరు మండలంలో రెండో రోజు చిన్నశింగనపల్లె గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వేల కోట్ల రూపాయలు డ్వాక్రా రుణాలను మాఫీ చేసి నాలుగు విడతల్లో మహిళల ఖాతాల్లో జమ చేసి ఇచ్చిన మాట నెరవేర్చామన్నారు. మహిళలు మహరాణులను చేయాలనే ఉద్దేశంతో వారి కోసం జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత లాంటి పథకాల ద్వారా కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. సీఎం జగన్‌తో పోరాడేందుకు రాష్ట్రంలోని పార్టీలన్నీ ఏకమయ్యాయని, ఎంత మంది కూటములుగా ఏర్పడినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు. అవినీతి రహితంగా పాలన అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు.

చంద్రబాబుతో జాగ్రత్త

విద్య, వైద్య రంగాల్లో నాడు–నేడు కింద అభివృద్ధి ఘననీయంగా జరిగిందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో మరోసారి మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలంటే మనం మరోసారి జగనన్న ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానల ఓబుళరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఓబుళరెడ్డి, సంగన హరినాథరెడ్డి, కోగటం వీరారెడ్డి, తుమ్మల కొండారెడ్డి, పీవీ రమణయ్య నాయుడు, జెగ్రి హరికృష్ణ, వీరమోహన్, స్థానిక నేతలు ఇరగంరెడ్డి పద్మనాభ రెడ్డి, వైస్ ఎంపీపీ మాదం ప్రభావతి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు మల్లికార్జున, మంచాల రాజగోపాల్‌రెడ్డి, మాబు షరీఫ్, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

పోరుమామిళ్ల: ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్నను రెండవసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఓటర్లను కోరారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వాసవీ నగర్, కొత్తవీధిలో నియోజకవర్గ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో విద్య, వైద్య రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించడమే కాకుండా, సచివాలయ వ్యవస్థతో ఇంటి ముంగిటకే పాలన తెచ్చారని కొనియాడారు. జగనన్న సంక్షేమ సారథి అని ప్రశంసించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో స్పెషలిస్టు డాక్టర్లు ఇంటి వద్దకే వస్తున్నారన్నారు. అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, కో ఆప్షన్ మెంబర్ అల్లా, జేసీఎస్ కన్వీనర్లు హనుమంతారెడ్డి, రమణారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, ఎంపీటీసీలు ఇస్సాక్, గురప్ప, గంగనపల్లె రామ్మోహన్‌రెడ్డి, బోయిళ్ల శివరాంరెడ్డి, ముంతాజ్‌బేగం, పట్టణ నాయకులు రుద్రవరం రాము, హబీబ్, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, మస్తాన్, రాము, నారాయణ, హుసేన్, పీరయ్య, గురయ్య పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు

ప్రొద్దుటూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి నీళ్లు రాయలసీమకు తరలిస్తామని సీమ ప్రజలను మభ్యపెట్టడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు చెప్పిన ప్రకారం గోదావరి నీళ్లు పెన్నానది సోమశిలలో కలిపినంత మాత్రాన రాయలసీమకు ఆ నీళ్లు చెందవని ఆయన పేర్కొన్నారు. నిజంగా రాయసీలమ మీద చిత్తశుద్ధి ఉంటే సిద్ధేశ్వరం అలుగు లేదా, సిద్ధేశ్వరం ప్రాజెక్టుకు ప్రధాని మోదీతో మాట్లాడి సిద్ధేశ్వరం ప్రాజెక్టు సాధించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం డ్యాంతో పనిలేకుండా సిద్ధేశ్వరం వలన రాయలసీమకు నీళ్లు చెందుతాయని తెలిపారు. జీఓ 69 తెచ్చి రాయలసీమకు నీళ్లు రాకుండా చేసిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. కియా పరిశ్రమలో ఎంత మంది రాయలసీమ వాసులకు ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

బద్వేలు అర్బన్: ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారస్తులు చలివేంద్రాల ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్, ప్రముఖ వ్యాపారవేత్త వెంకట శివనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బతి సత్యనారాయణ, కొలిశెట్టి నాగరాజ, తుమ్మలపెంట సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

గోపవరం: మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం, చిన్న గోపవరం గ్రామ సచివాలయాల వద్ద శనివారం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత రోజురోజుకు అధికంగా ఉండటంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ రహదారి పక్కనే శ్రీనివాసపురంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో వాహనదారులకు, స్థానికులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో, రోడ్డు పక్కన వీలైనంత వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ రాధాకృష్ణన్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు గోపవరంలో రెండు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

బ్రాహ్మణపల్లెలో గ్రామదర్శిని



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ చిరంజీవి

కలసపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ప్రలోభాలకు, మద్యం, డబ్బులకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని తెలిపారు. ఘర్షణలకు పాల్పడితే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బ్రాహ్మణపల్లెలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగార్జున, కానిస్టేబుళ్లు రాజకుమార్, రవితేజ పాల్గొన్నారు.

భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రొద్దుటూరు: సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కీలక పాత్ర పోషించనుందని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు పేర్కొన్నారు. వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ‘రీసెంట్ ట్రెండ్స్ ఇన్ కంప్యూట్ సైన్స్–2024’ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వక్తలు బెంగళూరుకు చెందిన వర్క్‌హాక్ మోహన్ తలపుల, హైదరాబాద్‌కు చెందిన త్రైవ్ డిజిటల్ ఎల్ఎల్‌పీ వెంకట సురేష్‌కుమార్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా వేర్‌హౌసింగ్ అంశాలపై ప్రసగించారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆర్.ప్రదీప్ కుమార్ రెడ్డి, కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య వర్క్‌షాప్ ఆవశ్యకత, ఐఓటీ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌కున్న సంబంధాన్ని వివరించారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు అధునాతన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్లు బి.జయరామిరెడ్డి, జి.జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం కొత్రపాటిపల్లె పంచాయతీలోని కాలువకట్ట, ఇందిరానగర్, రాజీవ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధను గెలిపించాలని ఓటర్లను కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఈ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ప్రచారంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురయ్య, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, బూతు కన్వీనర్లు రాజారెడ్డి, సీతారామిరెడ్డి, కృష్ణారెడ్డి, యల్లారెడ్డి, నాగరాజరెడ్డి, మాజీ సర్పంచులు డాక్టర్ మాబు, జేకే, నాయకులు ఆంతోని, మునారెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం: మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాల్గుణమాసం మూడవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. గోపవరం మాజీ ఎంపీపీ గోపవరంశిరీష స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రేపు బి.మఠంలో
ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

బ్రహ్మంగారిమఠం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం మండల కేంద్రమైన బి.మఠంలో ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎంపీ పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరుకు ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు ఎంపీపీ. జెడ్పీటీసీ పాల్గొంటారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

నగదు, మద్యం స్వాధీనం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మల్లకతువ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కాశినాయన మండలం వంకమర్రికి చెందిన ఉంటా నరసింహులు నుంచి 15 బీరుబాటిళ్లు, కలసపాడు మండలం రామచంద్రాపురానికి చెందిన దారం రామకృష్ణ వద్ద నుంచి 52 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. రాయచోటికి చెందిన రామకృష్ణ ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళుతున్న 1లక్ష 100 రూపాయల నగదు సీజ్ చేశామన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ప్రొద్దుటూరు: స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయం వద్ద శనివారం ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని దివ్యాంగులకు నిత్యావసర సరుకులు ఒక కిట్‌గా రూపొందించి అందజేశామని తెలిపారు. ఎద్దుల సుబ్బరాయుడు, మహమ్మద్ బాషా, వెంకటసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అట్లూరు: మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లి వినోద్ (23) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు బి.మఠం మండలం వాంపల్లెచెరువు గ్రామానికి చెందిన వినోద్ తన భార్యను చూసేందుకు ద్విచక్ర వాహనంపై ఒంటిమిట్టకు వెళుతుండగా సిద్ధవటం పెన్నానది నుంచి ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వినోద్‌ను 108 వాహనంతో కడప రిమ్స్‌కు తరలించారు.

నూతన టూ వీలర్స్ సుజుకీ షోరూం ప్రారంభం



టూ వీలర్స్ సుజుకీ షోరూంను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం: రిహాన్ సుజుకి వారి నూతన టూ వీలర్స్ సుజుకీ షోరూంను శనివారం ప్రొద్దుటూరులో ప్రారంభించారు. రిహాన్ సుజుకీ షో రూంను సుజుకీ మోటర్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ వెంకటేషన్, నూతన ఆటో మేటెడ్ వర్క్‌షాపును రీజినల్ మేనేజర్ కె. శివరామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిహాన్ సుజుకీ ఎస్ఎండీ సోహైల్ మాట్లాడుతూ అత్యాధునిక హంగులు, హైటెక్నాలజీతో అన్ని రకముల వాహనాలు, అన్ని రంగుల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ వై శివ ప్రసాద్, ఏరియా సర్వీస్ మేనేజర్ కే రమణ బాబు, ఖ్వాజా సుజుకీ గ్రూప్స్ అధినేత ఎస్ అబ్దుల్‌ఖాదర్, రిహాన్, షేయాన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

చాపాడు: ఉద్యోగులందరూ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ సూచించారు. ఎంపీడీఓ సభా భవనంలో శనివారం ఎన్నికల నిర్వహణ విధులపై సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా నియమితులైన సెక్టార్, రూట్ ఆఫీసర్లతో పాటు బీఎల్‌ఓలు, ఇతర అధికారులు తమ విధులను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ నిబంధనల మేరకూ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు.